విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి
శనివారం 01 మార్చి 2025 8 పేజీలు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా నాయకులు
కుంచె వసంతరావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కుంచె వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ దశల వారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జంగారెడ్డిగూడెం మునిసిపల్ పరిధిలోని అఖిలపక్ష రాజకీయ పక్షాలు,కార్మిక సంఘాలతో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కుంచె వసంతరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులకు చాలీచాలని వేతనాలతో దుర్భర పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారని ,ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో వెలుగులు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఏళ్ల తరబడి పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమైనప్పటికీ ఉద్యోగ భద్రత లేదని, ప్రభుత్వాలు కార్మికులను ఎన్ఎంఆర్‌లుగా, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణిస్తున్నారే తప్ప,పర్మినెంట్ కార్మికులుగా గుర్తించడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికుల జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్ మాట్లాడుతూ కార్మిక సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించటం పట్ల ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మున్సిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు రాజకీయాలకతీతంగా అందరు సంఘీభావంగా మద్దతు తెలపాలని ఆయన కోరారు. జనసేన సీనియర్ నాయకులు మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని,అందుకు తన వంతు కృషి ఉంటుందని ▶మిగతా 2లో..

హామీల అమలుకు
బడ్జెట్‌లో మొండిచేయి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు లాంటి సూపర్ సిక్స్ హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో నిధులు కేటాయించ లేదని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. డ్వాక్రా మహిళలకు 10 లక్షల రూపాయలు వరకు సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని, మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న హామీల అమలుకు బడ్జెట్ లో మొండి చేయి చూపారన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని, ప్రభుత్వోద్యోగాల కల్పన ఊసే లేదని కోనాల విమర్శించారు. తల్లికి వందనం రెండేళ్లకు సుమారు 25 వేల కోట్ల రూపాయలు అవసరం కాగా కేవలం 9,400 కోట్ల రూపాయలే కేటాయించారని కోనాల ఆగ్రహం వ్యక్తం ▶మిగతా 2లో..

6న చలో విజయవాడ

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: ఈనెల 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రౌండ్ కేబుల్ సమావేశంలో వక్తలు తీర్మానించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) దశల వారి ఆందోళనలో భాగంగా శుక్రవారం ఏఐటియుసి ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో నగర కార్పొరేషన్ పరిధిలో రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాలు మున్సిపల్ శాఖ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు.ఆప్కాస్ రద్దుచేసి కార్మికులను, దళారి, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పడం దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్, ఎన్ కాష్ మెంట్,3 డీఏలు సత్వరం విడుదలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 3వ తేదీన కలెక్టరేట్ ఎదుట ఆందోళనతో పాటు 6వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, నగర అధ్యక్షులు కె. కృష్ణమాచార్యులు, కడుపు కన్నయ్య,బళ్ల కనకదుర్గారావు, ఆటో యూనియన్ అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతి కుమార్, కే.నాగేంద్ర, బంగారు దుర్గాప్రసాద్,డి. రవీంద్ర,గోవాడ మల్లేశ్వరరావు, సరంశెట్టి సురేష్, బంగారు గురు ప్రసాద్ పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సులు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. 6 జిల్లాలైన ఏలూరు, పశ్చిమ గోదావరి,తూర్పు గోదావరి,డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా, కాకినాడ జిల్లాల నుండి పటిష్టమైన పోలీసు భద్రతతో బ్యాలెట్ బాక్సులను సిబ్బంది గురువారం రాత్రి నుండి శుక్రవారం ఉదయం వరకు తీసుకువస్తూనే ఉన్నారు. సీళ్లు వేసిన బ్యాలెట్ బాక్సులను ఏలూరు సర్. సి. ఆర్. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలలో సంబంధిత రెవిన్యూ డివిజినల్ అధికారులు అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు వేసి,స్ట్రాంగ్ రూములకు తరలిం చారు. బ్యాలెట్ బాక్సులను భద్రపర చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటుచేశారు. ఎన్నికల పరిశీలకులు సిహెచ్ శ్రీధర్, జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ,ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఏలూరు తహసిల్దార్ శేషగిరిరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన క్రీడాకారులు

విశాలాంధ్ర - కాకినాడ : ఈనెల 21 నుంచి 23 వరకు విజయవాడ క్లబ్‌లో జరిగిన ఏపీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన కాకినాడ జిల్లా క్రీడాకారులు శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. మార్చి 16 నుంచి 23 వరకు గోవాలో జరిగే మాస్టర్స్ జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసి కాకినాడ జిల్లాకు పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కర్రి భామిరెడ్డి, వి. శారదా దేవి, చంద్ర గోవిందరాజు, బి.కృష్ణ మూర్తి, డిఏఎన్ ప్రసాద్‌వర్మ, వై. సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు



విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో అరిగెల రంగయ్య అసోసియేషన్ ఆధ్వర్యంలో గొల్లవిల్లి జడ్‌పి హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు మూడవరోజు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. ఇండియన్ బ్యాంకు వెర్సస్ కేరళ ఇన్కమ్ టాక్స్ వెర్సస్ బెంగుళూరు ఇండియన్ బ్యాంకు వెర్సస్ హపర్స్ జీఎస్టీ వెర్సస్ బెంగుళూరు ఇన్‌కంటాక్స్ వెర్సస్ కేరళ జట్ల మధ్య హోరా హోరీగా మ్యాచ్ జరిగింది. బాల్ క్రింద పడకుండా ప్రేక్షకులను రంజింప చేసే విధంగా ఆటగాళ్లు క్రీడ ప్రతిభను కనపరిచారు. ప్రేక్షకులు గ్యాలరీ నిండిపోయి చాలామంది రోడ్లపైనే నిలబడిపోయారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను తిలకించారు. నాయకులకు ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేసారు. అసోసియేషన్ అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ స్వాగత ఏర్పాట్లు చేపట్టారు. సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా నుండే కాక ఇతర ప్రాంతాలనుండి కూడా క్రీడాభిమానులు విచ్చేసి పోటీలను తిలకించారు.

గొరగనమూడిలో ఏబీ - పీఎంజేఏవై

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొరగనమూడి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకం అయిన ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబి - పిఎంజెఏవై)ఆన్లైన్ కార్యక్రమాన్ని వేగవంతంగా చేస్తున్నట్లు ఏఎన్ఎం వేదకుమారి

తెలిపారు. ఈ పథకానికి 70 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు అర్హులని, దేశంలో ప్రభుత్వం నిర్దేశించిన హాస్పటల్లో గరిష్టంగా 5 లక్షల వరకు సంబంధిత ఆరోగ్య భీమా వర్తిస్తుందని అన్నారు. గత నెల రోజుల నుండి ఈ పథకాన్ని ఆన్లైన్లో పొందుపరుస్తున్నట్లు తెలి పారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టైలర్ల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కూటమి పార్టీల ఆధ్వర్యంలో టైలర్ల అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు

తెలిపారు. టైలర్ దినోత్సవ సందర్భంగా శ్రీ విలియంహౌ గణపతి రామ టైలర్స్ సేవ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో వినాయకుని ఆలయం వద్ద టైలర్స్ డే సంఘ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేష్ట రామకృష్ణ మాట్లాడుతూ చేతి వృత్తుల వారి అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చినబాబు, మట్ట సూర్యచంద్రం, ఉప సర్పంచ్ సంకు కొండలరావు, రామదాసు వెంకటరమణ, చెప్పుల మధుబాబు, సంకు కృష్ణ, టైలర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యం, జ్ఞానంతో కూడిన విద్య అవసరం

విశాలాంధ్ర -పెదపాడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే నైపుణ్యం జ్ఞానంతో కూడిన విద్య అవసరం ఎంతైనా ఉందని పెదపాడు జెడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు పి .వెంకటేశ్వరరావు

అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పి హైస్కూలులో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్. సి.వి.రామన్ చిత్రపటానికి హెచ్ఎం వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం అందజేస్తున్న సైన్స్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వడ్డాది నాగసుబ్రమణ్యం, ఉపాధ్యాయ , ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాయకుదురులో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర- వీరవాసరం: మండలంలోని రాయకుదురు గుడాల వారి వీధిలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన తోట రాంపండుకు చెందిన

తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఉన్న నగదు, బంగారం, దుస్తులు మంటల్లో కాలిపోయాయి. సుమారు పది లక్షల రూపాయల ఆర్థిక నష్టం జరిగింది. తోట రాంపండు చెందిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

గతం కంటే మెరుగైన ఓటింగ్ శాతం నమోదు

విశాలాంధ్ర-ఏలూరు: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలయినప్పటి నుంచి జిల్లా యంత్రాంగం నిర్విరామంగా ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె. వెట్రిసెల్వి నేతృత్వం, నిరంతర పర్యవేక్షణతో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. పట్టభద్రుల నియోజవర్గ పరిధిలో 456 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది.మొత్తం 3,14,984 మంది ఓటర్లకు, 2,18,902 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.పోలింగ్ శాతం 69.50 గా నమోదైయింది. 2019 ఎన్నికల కంటే తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది.గత ఎన్నికల్లో 2,93,794 మంది ఓటర్లు ఉంటే వారిలో 1,92,137 మంది (65.40) ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఈ పోలింగ్ శాతం గతం కంటే 4.09 శాతం పెరిగింది.

కనిపించని సర్వే నెంబరు

అయోమయంలో అధికారులు

విశాలాంధ్ర-చాట్రాయి : చీపురుగూడెంలో సర్వేనెంబర్ 645/8 ఎక్కడ ఉందని మూడు శాఖల అధికారులు కలిసికట్టుగా వెతుకుతున్నా రికార్డులు దొరకకపోవడంతో జాయింట్ సర్వేలో అయోమయంలో పడిన అధికారుల అవస్థలు అన్ని నీకు కావని తెలుస్తుంది.

మూడు శాఖల అధికారులు ముప్పతిప్పలు పడుతున్నారని సమాచారం. కాట్రపల్లిలో చీపురుగూడెం గ్రామంలోని అడవిలో 2021 సంవత్సరంలో కార్పొరేట్ కోళ్లఫారాన్ని ఒక వ్యక్తి నిర్మించారు.2022 సంవత్సరంలో కోళ్ల ఫారం పూర్తిగా అటవీ భూమిలో ఉందని గ్రామానికి చెందిన కొందరు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కానీ ,అడవి భూముల్లో గాని, పట్టా భూములలో కానీ 645/8 అనే సర్వే నెంబరు ఆనాటి నుండి ఈనాటి వరకు ఎక్కడ వెతికినా దొరకని పరిస్థితి. మూడు నాలుగు రోజులలో లోకాయుక్త కోర్టు వాయిదా ఉన్న నేపథ్యంలో శుక్రవారం అటవీ శాఖ, రెవెన్యూ శాఖ ఉన్నత స్థాయి సర్వే అధికారులు అందరు కలిసి కలిసికట్టుగా ఎంత వెతికినా దొరకకపోవడంతో కోర్టుకు వెళ్లి అధికారులు ఏం సమాధానం చెప్పుకోవాలి అని అయోమయానికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

కలర్ ప్రింటర్ బహూకరణ

విశాలాంధ్ర - గణపవరం: ప్రభుత్వ పాఠశాలకు కలర్ ప్రింటర్ బహూకరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ఏ ఎస్ ఎస్ ప్రసాద్ రాజు శుక్రవారం తెలిపారు. గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామంలో ఉన్న ఎం పి యు పి ఎస్ పాఠశాలలో జరిగిన 2003-04 బ్యాచ్ - 7వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగిందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా పాఠశాలకు రూ.15,000విలువ చేసే కలర్ ప్రింటర్ ను పూర్వ విద్యార్థులు బహుకరించారని ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరగడం కోసం వారి వంతు కృషి చేసి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. వీరిని గ్రామ సర్పంచ్ కర్రి రాధా లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, విద్యాదాత అల్లూరి బదరీ నారాయణ, గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు అభినందించారు.

మొండిచేయి

(1వ పేజీ తరువాయి)

చేశారు. అన్నదాత సుఖీభవ అమలుకు రైతులకు ఏడాదికి 20 వేలు రూపాయలు అందిస్తామన్న కూటమి ప్రభుత్వం హామీ అమలుకు అరకొర నిధులే కేటాయించడం జరిగిందని, కూటమి ప్రభుత్వం ఎన్నికలు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలుకు బడ్జెట్లో తగినవిధంగా నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపించినట్టు కోనాల ధ్వజమెత్తారు.

పరిష్కరించాలి

(1వ పేజీ తరువాయి)

తెలిపారు. వైఎస్సార్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో అవుట్ సోర్సింగ్ వ్యవస్థ నుండి కార్మికులకు విముక్తి కలిగించామని రూ.12వేలు నుండి రూ. 15వేలు,పారిశుధ్య కార్మికులకు రూ.12వేలు నుండి రూ.21వేలకు జీతాలు పెంచామన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పి. కాశీ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిచో కార్మికులు చేసే ఆందోళనలకు తమ పూర్తి మద్దతు ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. ఐఎఫ్టీయు నాయకులు రమణ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చెయ్యాలని, పీఎఫ్,ఈఎస్ఐ సక్రమంగా జమ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటీయూ పట్టణ కార్యదర్శి పి. సూర్యారావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చేదాకా ఒక మాట వచ్చిన తరువాత మాట మార్చడం ఆయా రాజకీయ పార్టీలకు అలవాటైందని అన్నారు. గత ప్రభుత్వంలో జగన్ అధికారంలోకి వచ్చేవరకు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేస్తానని నమ్మించి మోసం చేసాడన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, స్థానిక 3వ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, వైఎస్సార్ పార్టీ జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం వైస్ ఛైర్మెన్ ముప్పిడి వీరాంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దాల ప్రసాద్, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, సెక్రటరీ నిమ్మల సుబ్బారావు, అయినాల ముత్యాలరావు, దోసూరి నాగరాజు, పారిశుధ్య విభాగం సెక్రటరీ బొక్కా శ్రీనివాస్, కొత్తూరి నాగేశ్వరరావు, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని ఎంఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రాలుకు

కేటాయించారు. ఎమ్మెన్నార్ జూనియర్ కాలేజీలో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.ఈ కేంద్రంలో చీఫ్ సూపర్ రింటెండెంట్గా కౌముది, డిపార్ట్మెంటల్ అధికారిగా మధును నియమించారు. ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 169 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్గా కే.విజయకుమారి, డిపార్ట్మెంటల్ అధికారిగా రవిని నియమిం చారు. రెండు కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ముందు జాగ్రత్తగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

కొత్త కాలనీకి మంచినీటి సదుపాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొత్త కాలనీలో మంచినీటి సదుపాయం ఏర్పాటు చేసినట్లు పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం లో పరింపూడి పంచాయతీ పరిధిలో మత్స్యకారుల ఏరియాను ఆనుకుని

జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారని, కాలనీలు ఇచ్చినప్పటికీ ఇల్లు నిర్మించుకోవడానికి నీరు లేక ఇళ్ళ నిర్మాణం మధ్యలోనే నిలిపివేయడంతో గృహ నిర్మాణ శాఖ ఆదేశాల మేరకు ఆర్డబ్ల్యూఎస్ శాఖ పర్యవేక్షణలో విద్యుత్ శాఖ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వగా పేద ప్రజలు ఇల్లు కట్టుకోవడానికి, మోటార్ బోరు ద్వారా నీరు సరఫరా చేసినట్టు సర్పంచ్ తెలిపారు. నూతనంగా ప్రభుత్వం ఇచ్చిన కాలనీలో ఇల్లు నిర్మించుకునేవారు తమ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సర్పంచ్ విజయ కుమారి పేర్కొన్నారు.

నాగేంద్రబాబుకు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు

విశాలాంధ్ర-లింగపాలెం: ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు పంటలు పండించే విధానంపై అధ్యయనం చేసిన ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న ఎన్. నాగేంద్రబాబుకు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు వచ్చింది. పంజాబ్ లో నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్లో కేంద్ర స్థాయిలో నిర్వహించబడుతున్న అగ్రిమెంట్ ఫౌండేషన్ సంస్థ ఈయనకు అవార్డు అందజేశారు. ఈయనకు అవార్డు రావడంతో మెట్ట

ప్రాంతంలోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈయన సేవలను ప్రశంసించారు. ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్న ఈయనను ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయంలోని పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, ఏలూరు జిల్లాలోని ఉద్యాన,వ్యవసాయ శాఖ అధికారులు అభినందించారు.

రేపు ట్రెజరీ ఉద్యోగ సంఘం ఎన్నికలు

విశాలాంధ్ర-భీమవరం : ఈ నెల 2వ తేదీ ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉప ఖజానాధికారి జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా ఖజానా కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్ పర్యవేక్షణలో ఎన్నికలు జరుగుతున్నాయని, సహాయ ఎన్నికల అధికారిగా జి. నరేంద్ర కుమార్, ఎన్నికల పరిశీలకులుగా ఎ. ఆంజనేయులు వ్యవహరిస్తారని ఆయన తెలియ జేసారు. జిల్లాలోని ట్రెజరీస్, అకౌంట్స్ డిపార్టు మెంటుకు ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువకుల మృతికి అధికారులు బాధ్యత వహించాలి

విశాలాంధ్ర-ముసునూరు: మహాశివరాత్రి సందర్భంగా ముసునూరు మండలం బలివే గ్రామంలో జరిగిన ఉత్సవాల్లో తమ్మిలేరులో మునిగి ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటనకు అధికారులే బాధ్యత వహించాలని సిపిఐ నేతలు పేర్కొన్నారు. ఉత్సవాలలో మృతి చెందిన సంఘటనా

స్థలాన్ని సిపిఐ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ నూజివీడు నియోజకవర్గం నేతలు నిమ్మగడ్డ నరసింహ, రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ సంఘటనకు కారణం అధికారుల బాధ్యతారాహిత్యమే అన్నారు. ముందు రోజు ఇద్దరు యువకులు మరణించిన 24 గంటల్లోనే మరో యువకుడు మరణించడం అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉత్సవాల సందర్భంగా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని, మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబంలో అర్హత బట్టి ప్రభుత్వ ఉద్యోగం,పక్కా గృహం ఏర్పాటు చేయాలని కోరారు.రానున్న రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలన బృందంలో చెంగల వెంకటేశ్వరరావు, కొక్కిరపాటి ఆనంద్ ఉన్నారు.

డిఎన్ఆర్ న్యాయ కళాశాలలో క్రీడలు

విశాలాంధ్ర -భీమవరం: డిఎన్ఆర్ న్యాయ కళాశాల 35వ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం విద్యార్థులకు స్పోర్ట్స్, గేమ్స్ నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ గాదిరాజు బాబు, జాయింట్ సెక్రటరీ

కే.రామకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురాం, వైస్ ప్రిన్సిపల్ వై.అశోక్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహరాజు, జి.డి.నాయుడు, అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, ఎం.భాస్కర్‌రావు, చిన్న వీర్రాజు, కిరణ్, ఎం.విజయ వాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మరియమాత మహోత్సవాలు

విశాలాంధ్ర - కలిదిండి: మార్చి 1,2,3 తేదీలలో మరియమాత మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్ సి ఎం చర్చ్ విచారణ కర్త బంటుమిల్లి యోహాను శుక్రవారం తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు సమిష్టి దివ్యబలి పూజా సమర్పణ, జపమాల, దివ్య పూజా బలి, సాయంత్రం 9 గంటలకు సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఆదివారం 9 గంటలకు సమిష్టి దివ్య పూజ సమర్పణ, జపమాల, దివ్య పూజ బలి, సాయంత్రం 9 గంటలకు మధుర గీతాలాపన, సోమవారం ఉదయం 8 గంటలకు సమిష్టి దివ్య పూజా బలి సమర్పణ, జపమాల

సాయంత్రం 6 గంటలకు విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు మరియు పలువురు గురువులచే సమిష్టి దివ్య పూజా బలి సమర్పణ, సాయంత్రం తొమ్మిది గంటలకు ఏసు కృప నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మరియమాతను దర్శించుకుని కృప ప్రాప్తులు కావాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : మార్చి 24,,25 తేదీల్లో తలపెట్టిన రెండు రోజుల బ్యాంకుల సమ్మె కార్యాచరణలో భాగంగా శుక్రవారం డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలు ధరించి బ్యాంకు ఉద్యోగులు తమ నిరసన ప్రకటించారు. తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ ప్రాంతాల బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. యూఎఫ్ బీయూ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మార్చి 3 వ తేదీన ఢిల్లీ లో పార్లమెంటుకు బ్యాంకు ఉద్యోగుల మోర్చా నిర్వహిస్తున్నారని నాయకులు తెలిపారు .

30 వరకు పశువులకు టీకాలు

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలోని పశువుల రైతులు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్లో కలెక్టర్ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం గోడపత్రికను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి ఒకటి నుండి మార్చి 30 వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక

టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు.

గోడ ప్రతి ఆవిష్కరణలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ, డిడి జవ్వారు హుస్సేన్, సహాయ సంచాలకులు గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

చికెన్, గుడ్లు తినవచ్చు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: రెడ్ జోన్ లో మినహా జిల్లా అంతటా గుడ్లు, చికెన్ నిరభ్యంతరంగా తినవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

శుక్రవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వేల్పూరు గ్రామంలోని కృష్ణా నందం కోళ్ల ఫారం నుండి ఒక కిలోమీటర్ పరిధిలో, పెదతాడేపల్లి గ్రామంలోని రామలక్ష్మి కోళ్ల ఫారం నుండి ఒక కిలోమీటర్ పరిధిలో మినహా జిల్లాలోని అన్ని గ్రామాల్లో గుడ్లు, చికెన్ అమ్ముట, కొనుటకు ఏ విధమైన ఆంక్షలు లేవని స్పష్టం చేశారు. ప్రజలు ఏ విధమైన అపోహలు లేకుండా ఉడికించిన గుడ్లు, ఉడకబెట్టిన కోడి మాంసం తీసుకోవచ్చని తెలిపారు. చికెన్, గుడ్లను షాపులు, రెస్టారెంట్ యజమానులు వ్యాపారాలు కొనసాగించ వచ్చునని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

దేశానికి ఖ్యాతితెచ్చిన రామన్ ఎఫెక్ట్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో కుంతలగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయుడు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ సివి రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ కారణంగా భారతదేశానికి ఆయన ఎనలేని ఖ్యాతిని తెచ్చారన్నారు. దీని కారణంగా భారతదేశం విజ్ఞాన శాస్త్రంలో ప్రపంచ స్థాయిలో పేరు తెచ్చుకుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని బాలబాలికల్లో సైన్స్ పట్ల స్ఫూర్తిని పొందాలని అదే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని రాయపూడి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. అమృత, కె.ఏసేపు,కే. రూత్ పాలేనా, బాల బాలికలు పాల్గొన్నారు.

కులవివక్ష నేరం

విశాలాంధ్ర- పాలకోడేరు : కుల వివక్ష చూపడం, సైగల ద్వారా గాని, మాటల ద్వారా గాని, చేతల ద్వారా గాని దూషించడం, అవమాన పరచడం ఎస్సి, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989 ప్రకారం నేరం అని పాలకోడేరు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎన్.భారతి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలోని సచివాలయంలో జరిగిన సివిల్ రైట్స్ డేకు ఆమె అధ్యక్షత వహించారు.ఆమె మాట్లాడుతూ సమా జంలో అందరూ కలిసి మెలిసి వుండాలని ఉద్బోధించారు. బడిలో

గానీ, గుడిలో గానీ, మార్కెట్‌లో గానీ ఎక్కడికైనా స్వేచ్ఛగా తిరిగే హక్కు అన్ని వర్గాలకు సమానంగా వుందనేది గుర్తెరగాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి రెడ్డియ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి వి జి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సరళ, వీఆర్వో శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్సు దినోత్సవం

విశాలాంధ్ర-లింగపాలెం: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని ములగలంపాడులోని ఇండియన్ పబ్లిక్ స్కూల్లో సైన్స్‌కు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగ పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలుగు తీయటానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడతాయని సైన్సు ఉపాధ్యాయులు తెలిపారు.

ఆరోగ్యం, ఒత్తిడి లేని విద్యతోనే భవిష్యత్తు

విశాలాంధ్ర - పెదపాడు: ఆరోగ్యం, ఒత్తిడి లేని విద్యతోనే ప్రతి విద్యార్థికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఏపీ సోషల్ ఆడిట్ డిఆర్‌పికె వెంకటరాజు అన్నారు. ఏపీ సాట్ (మంగళగిరి) నుంచి వచ్చిన డిఆర్పి కె. వెంకటరాజు శుక్రవారం స్థానిక

పెదపాడు జెడ్ పి హెచ్ స్కూలులో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు. పాఠశాలలో అందుతున్న భోజనం పై విద్యార్థులతో ఆయన చర్చించారు.మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీ సభ్యులను ఆదేశించారు. స్టాక్ రూమ్ లో బియ్యం, గుడ్లు, చిక్కిలు, వంట దినుసుల నిల్వలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న తాగునీటి సరఫరా గురించి ఆరా తీశారు. కిచెన్ గార్డెన్ పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థులలో అవగాహన కలిగించారు. ప్రభుత్వ నిర్దేశించిన విధంగా పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాల అమలు తీరుపై వెంకటరాజు సంతృప్తి వ్యక్తం చేశారు. వెంకటరాజు వెంట పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు వడ్డాది నాగ సుబ్రహ్మణ్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర-కామవరపుకోట: తడికలపూడి శ్రీసాయి విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూలులో శుక్రవారం సైన్స్ ఫెయిర్ జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ కడిమి రమేష్ ముఖ్య అతిథిగా

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడిమి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు వారి ప్రతిభను కనబరిచి, తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్ట్‌ను చూసి వారి ప్రతిభను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్,ఎంపీటీసీ గంగుల కడియాలు, కరస్పాండెంట్ బోయపాటి లక్ష్మి,బంగారు బాబు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బోస్‌కు పి.సి. సర్కార్ ఎక్సలెన్సీ అవార్డు

విశాలాంధ్ర -భీమవరం: పట్టణానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ బోస్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద చేతుల మీదుగా పి.సి.సర్కార్ సీనియర్ మెమోరియల్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత

ఇంద్రజాలికుడు పి.సి. సర్కార్ సీనియర్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్ర భారతిలో శుక్రవారం ఇంద్రజాలికుల దినోత్సవం నిర్వహించారు. మేజిక్ రంగానికి బోస్ అందించిన సేవలను, పి. సి. సర్కార్ రచనలను తెలుగులోకి అనువదించి, ప్రచురించినందుకూ, బోస్‌ని ప్రశంసిస్తూ అవార్డు అందచేశారు. ఆర్.కె. వండర్ వరల్డ్, తెలంగాణా మేజిక్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక విభాగం సంయుక్త నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ఇంద్రజాలికులు బి.వి.పట్టాభిరాం, చొక్కాపు వెంకట రమణ, మర్రి రమేష్, స్టిక్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

విశాలాంధ్ర - పాలకోడేరు : మండల వ్యాప్తంగా మార్చి 1వ తేదీ నుండి 30 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో అన్ని పశువులకు, పేయి దూడలకు టీకాలు వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ హేమ తెలిపారు. టీకాలు వెయ్యడం వల్ల పాలిచ్చే పశువులకు పాలు దిగుబడి తగ్గిపోతాయేమోనన్న అపోహలను రైతులు వీడి తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

గుండుగొలను వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జికి రూ.4.50 కోట్లు విడుదల

త్వరలో వంతెన నిర్మాణం పనులు ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : జిల్లాలోని గుండుగొలను గ్రామం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ) నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే వంతెన నిర్మాణ పనులకు సంబంధించి అధికారులు ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. ఫలితంగా దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

ఏలూరు జిల్లా గుండుగొలను సమీపంలోని గరుడ హోటల్ వద్ద జాతీయ రహదారికి (ఎన్.హెచ్ 16) ఒకవైపు నుంచి మరోవైపు వెళ్ళేందుకు అవకాశం లేకపోవడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు మృత్యువాత పడటంతో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకు వెళ్ళారు. దీనిపై తక్షణం స్పందించిన ఎంపీ మహేష్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి వీలుగా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ కేంద్రమంత్రిని స్వయంగా కలిసి ఎంపీ మహేష్ వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను ఎంపీ మహేష్ కేంద్ర మంత్రికి వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎన్.హెచ్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వంతెన నిర్మాణ పనులను గుత్తేదారుకు అప్పగించారు. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టి 3 నుంచి 6 నెలల వ్యవధిలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్.హెచ్ అధికారులు బదులిచ్చారు.

రాష్ట్ర బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

ఎంపీ పుట్టా మహేష్ వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత కల్పించారని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ పై శుక్రవారం ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదాయం, అప్పులు బేరీజు వేసుకుంటూ ప్రాధాన్యత క్రమంలో పథకాల అమలుకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకు వేసిందని ఎంపీ తెలిపారు. విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తల్లికి వందనం పథకం అమలుకు బడ్జెట్లో రూ.9,407 కోట్లు నిధులు కేటాయించడం శుభ పరిణామం అన్నారు.

బీసీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో పెద్దపీట వేసిందని ఎంపీ కొనియాడారు. బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం మరోసారి బీసీల పట్ల తనకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఎంపీ తెలిపారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం రూ.6,705 కోట్లు కేటాయించడాన్ని తను స్వాగతిస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలు, మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందని ఎంపీ తెలిపారు. పాఠశాల, ఉన్నత విద్య, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, పురపాలక, జల వనరులు, గృహ నిర్మాణ శాఖలకు నిధులు కేటాయించిన కూటమి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధిని చెప్పకనే చెప్పిందని ఎంపీ అభిప్రాయపడ్డారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిన ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచిందని ఎంపీ తెలిపారు.

.టైలర్స్‌డే

విశాలాంధ్ర-కామవరపుకోట: మానవతా స్వచ్ఛందసేవ సంస్థ వారి ఆధ్వర్యంలో టైలర్స్ డే సందర్భంగా ఇద్దరు టైలర్స్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిడతా రమేష్, కనకరాజు, ఇబ్రహీం, పొన్నుబోయిన సురేష్, వేముల సాయి, చినబాబు, మద్దిపాటి రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై ఎన్నికల హామీని నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -తణుకు: ఇళ్ళు లేని నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం హామీ ఎలాంటి కాలయాపన లేకుండా త్వరితగతిన నెరవేర్చేందుకు చర్యలు చేపట్టాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.సీపీఐ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం వేల్పూరు గ్రామంలో కనకదుర్గమ్మ గుడి వద్ద లబ్ధిదారులచే ఇళ్ళ స్థలాల అర్జీలు పూరించారు. ఈ సందర్బంగా భీమారావు మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు స్వంత ఇంటి కల నెరవేరుస్తామన్న కూటమి ప్రభుత్వం హామీ అమలుకు పూనుకోవాలన్నారు. ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి,రాష్ట్ర సమితి సభ్యురాలు పై. నాగలక్ష్మి, ఎన్. రామశ్రీను, జక్కంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: దేశ ప్రగతికి సైన్స్ పరిశోధనలు ఎంతో కీలకమని వరంగల్ నిట్ గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ జేవీ.రమణ మూర్తి తెలిపారు. ఏపీ నిట్‌లోని స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.అమరేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ మేధావి సీవీ రామన్ అని కొనియాడారు. రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారత ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేసిన ఘనత సర్ సీవీ రామన్ కే దక్కుతుందన్నారు. డీన్ లు డాక్టర్ కే. హిమబిందు, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ నవభారత్ నిర్మాతలు విద్యార్థులేనని, సర్ సీవీ రామన్ స్ఫూర్తితో విభిన్న ఆలోచనలపై దృష్టిసారించాలని వివరించారు. డాక్టర్ రమణమూర్తిని ఆచార్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు ప్రాజెక్టులను పెదతాడేపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ టి.కూర్మయ్య, డాక్టర్ జె.కృష్ణమూర్తి, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శరద్ ద్వివేది, డాక్టర్ రాముడు, శ్రీరామ విద్యానికేతన్ ఉపాధ్యాయులు పి.ఎన్.శిరీష దేవి, జీవి.లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, గంగరాజు, మణికంఠ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సైన్స్ అసోసియేషన్, ఐ క్యూ ఏసీ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మలకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. మధురాజు, ఎన్. వి.ఎన్.బి. శ్రీనివాసరావు, డా.సి.హెచ్ చైతన్య, మెయిన్ అన్సారీ, డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ జి. వెంకట రమణ, భాస్కర రావు, దేవదాసు ఇతర అధ్యాపకులు, ఉపాధ్యాయులు, హైస్కూల్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: పశువులకు గాలికుంటు టీకాలు వేయించి వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చును అని మండల పశు వైద్యాధికారి కె కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పశువైద్య శాల వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో గల 21651 గేదెలకు, 5100 ఆవులకు మార్చి 1వ తేదీ నుండి 31తేదీ వరకు గాలికుంటు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. 4నెలల నుండి 8నెలల పెయ్య దూడలకు బ్రూసెల్ల వాక్సిన్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. గాలి కుంటు టీకాలు వేయడం వలన పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చునని ఆయన తెలిపారు. వ్యాధి సోకిన మగ పశువుల్లో తగ్గే పని సామర్థ్యాన్ని పూర్తిగా నివారించ వచ్చును అన్నారు. దూడల్లో మరణాలు తగ్గి ఆరోగ్యంగా ఎదగడానికి గాలికుంటు టీకాలు దోహదపడతా యని ఆయన తెలిపారు. గాలి కుంటు నివార ణకు టీకాలు ఒక్కటే మార్గం అని ఆయన తెలిపారు.

సిద్ధార్థలో సైన్స్‌డే

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సైన్స్ డే సందర్బంగా స్థానిక సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వద్ద విద్యార్థిని విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల వైజ్ఞానిక పరికరాలతో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కరస్పాండెంట్ ఐ. రాజ్ కుమార్ విద్యార్థుల మేధో శక్తితో తయారుచేసిన పరికరాలను సందర్శిం చారు. విద్యార్థుల మేధో శక్తిని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని రాజ్ కుమార్ తెలిపారు. వివిధ వస్తువులను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆనంద్, స్వామి, వెంకట్, మానస తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న డ్రైయర్‌లో పడి బీహార్ వాసి మృతి

విశాలాంధ్ర -లింగపాలెం: ములగలంపాడులోని జీఎస్ సీడ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో బీహార్ రాష్ట్రం, హరిరియజిల్లా, పుర్లియా మండలం, సింహోరిబాణి గ్రామానికి చెందిన చూపేష్ కుమార్(20) మృతి చెందాడు. విత్తనాలు డ్రై చేసే బిన్నులో పడటంతో ఈ ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో బీహార్ వాసి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ధర్మాజీగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి13న బీహార్ నుంచి వచ్చి ఫ్యాక్టరీలో రోజువారి కూలీగా చేరాడు. ఇంతలోనే అనుకోకుండా ఈ ప్రమాదం జరిగింది. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతునిని బీహార్ లోని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లను ఫ్యాక్టరీ యాజమాన్యం చేశారు.కూలికోసం వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లిన అప్పుడ్ని కోల్పోవడంతో కూలి పనుల కోసం వచ్చిన బీహార్ వాసులంతా ఆవేదన చెందుతున్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

విశాలాంధ్ర-పెంటపాడు : మానవత వ్యక్తిత్వ వికాస తరగతులు చైర్మన్ తారాడి పాల్ అధ్యక్షతన శుక్రవారం అల్లంపురం,మీనవల్లూరు గ్రామాలలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు.

వ్యవస్థాపకులు రామచంద్ర రెడ్డి ఆశయాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తారడి పాల్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెంటపాడు మండల విద్యాశాఖ అధికారి- 2 ఐవి రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సంస్థ విద్యకు పెద్దపీట వేస్తుందని, విద్యార్థు లు పాఠ్యాంశాలతో పాటు ,నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యశించాలని, ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి, అది సాధించే వరకు అహర్నిశలు కృషిచేయా లన్నారు. హెచ్.ఎమ్. తాడేపల్లి శారద మానవత సేవలు అందిస్తున్న మానవత పెంటపాడు మండలం వారికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు ఉపాధ్యాయులు స్కూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు . ప్రతిభను కనబరచిన విద్యార్థులకు 6 వేల రూపాయల విలువైన బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు, విజయాభవ కరపత్రములు, విద్యార్థులకు బిస్కెట్లు, జిప్ ఫైల్స్, పాఠశాల కొరకు హెచ్ఎం కి టేబుల్ క్యాలెండర్ అందజేశారు.

విద్యార్థి దశ నుండే సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర- కాళ్ళ : జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ సీసలిలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చిన్నారులు తయారుచేసిన ప్రాజెక్టులను మండల విద్యాశాఖ అధికారి ఎ. రవీంద్ర పరిశీలించి ప్రశంసించారు. విద్యార్థి దశనుండే సైన్స్ పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తిని పెంపొందించుకోవాలని, ప్రతి విషయాన్ని ఎందుకు, ఏమిటి ఎలా అని ప్రశ్నించుకోవడం ద్వారా జ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఎంఈఓ రవీంద్ర తెలియజేశారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్పీహెచ్ఎస్ సైన్స్ ఉపాధ్యాయులు నిమ్మల శ్రీనివాస్ రామన్ ఎఫెక్ట్ గురించి పిల్లలకు వివరించారు. సీసలి సైన్స్ ఉపాధ్యాయులు ఎన్. శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించారు. మండల విద్యా కేంద్రంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో 28 సంవత్సరాలు కలవపూడి సి బి సి ఎన్ సి పాఠశాలలో పనిచేసి పదవి విరమణ పొందిన అపర సుభాషిణిని, 8 సంవత్సరాలు పనిచేసిన శివారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2. వెంకటేశ్వరరావు , సాయి వర్మ, జనార్దన్ .సుబ్బరాజు, బి.ఆర్.ఎం.కె.స్వామి, ఎన్. విజయలక్ష్మి కల్కి మూర్తి, బేబీ ప్రశాంతి, అందే.విజయలక్ష్మి, అరుణ కుమారి, గీత, ప్రధానోపాధ్యాయులు, సీఆర్ ఎం టీ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి నూతన మోటార్ వాహన చట్టం అమలు

విశాలాంధ్ర - అమలాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మోటార్ వాహనాల చట్టం ప్రకారం వాహనాలను నడిపే వారు వాహన చట్టాలను ఉల్లంఘించిన యెడల నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాల ప్రకారం జరిమానా మరియు జైలు శిక్ష విధించడం జరుగుతుంది. 2019 కొత్త వాహన మోటారు సవరణ చట్టం ప్రకారం ట్రాఫిక్ ఉల్లంగనలకు జరిమానాలు గణనీయంగా పెంచబడి గతంలో కంటే కటినంగా మారాయి. ఈ చట్టం మార్చి 1 నుంచి అమలులోకి రావడం జరుగుతుంది. వాహన దారులు గమనించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించడం జరిగింది. భద్రతా వారోత్సవాల కార్యాక్రమాలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు, వాహన దారులకు, ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలని, వాహనాలు నడిపెటప్పుడు సెల్ ఫోన్ వినియోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, తగిన వేగంతో వాహనాలను నడపాలని సూచించడం జరిగింది. ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డునపడి జీవన విధానము తలక్రిందులవుతుంది. కాబట్టి వాహనాలు నడిపెటప్పుడు ఎవరి రక్షణ వారే కల్పించుకుని జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ ఎదుటి వారి ప్రాణాలను కూడా రక్షించాలని సూచించడం జరిగింది.

ఈ క్రింది విధంగా జరిమానాలు విధించడం జరుగుతుంది. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే రూ.5000 జరిమానా, లైసెన్స్ లేనివానికి వాహనము నడుపుటకు అనుమతించిన యెడల రూ.5000 వరకూ జరిమానా. మద్యం, మాదక ద్రవ్యాలు సేవించి వాహనమును నడిపినట్లయితే మొదటి సారి రూ.10000లు, ఆరు నెలల జైలు శిక్ష. పదే పదే జరిగే అపరాధం కోసం రూ.15000లు, జైలు శిక్ష 2 సంవత్సరాలు. హెల్మెట్ ధరించని మోటార్ వాహనం నడినట్లయితే రూ.1000లు జరిమానా,. సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాన్ని నడిపినట్లయితే 1000 రూపాయిల జరిమానా విధించడం జరుగుతుంది. మైనర్లు వాహనాలను నడిపితే రూ.5000లు, నిర్లక్ష్యంగా, ప్రామాధకరంగా వాహనాలను నడిపితే మొదటిసారి రూ.1500లు, రెండవసారి, తదుపరి నరమునకు 10000 జరిమానా విధించడం జరుగుతుంది. భారీ వాహనాలుకు కూడా జరిమానా విధించబడును. వాహన దారులు మరియు ప్రజలు కొత్త మోటారు వాహన చట్టాల నియమ నిబంధనల ప్రకారం వాహనాలను నడుపుతూ, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ

విశాలాంధ్ర - కాకినాడ, మండపేట : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అయినప్పటికీ ఇటు ప్రజల ఇటు అధికారుల మన్నలను పొందిన కొమ్మిశెట్టి ఈశ్వరావు ధన్యజీవి అని రామచంద్రపురం పోస్టల్ ఇన్స్పెక్టర్ పి కామేశ్వరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం పోస్ట్ మాన్ ఈశ్వరావు పదవీ విరమణ సందర్భంగా మండపేట పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్మాస్టర్ ఎంవి సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు అయిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. 29 సంవత్సరాలు పాటు పోస్ట్మాన్‌గా సుదీర్ఘ సేవలు అందించి సౌమ్యునిగా పేరుగాంచిన ఈశ్వరావు సేవలు అభినందనీయమని అన్నారు. ఈ సభలో కెవి నారాయణ రావు, కొండపల్లి సూర్యనారాయణ, పోస్టల్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి జి వెంకట్రావు, కే అనూష, టి పుల్లేశ్వరావు తదితరులు ఈశ్వరావు సేవలను కొనియాడుతూ ప్రసంగించారు. అనంతరం ఈశ్వరావును తపాలా ఉద్యోగులంతా ఘనంగా సత్కరించారు.

హామీలు ఇచ్చి ప్రజలను వంచించారు : కాంగ్రెస్

విశాలాంధ్ర - జగ్గంపేట : అమలు సాధ్యం కానీ పథకాలను ఎరగా చూపి గద్దనెక్కిన కూటమి రాష్ట్ర ప్రజలను వంచించారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడి తప్ప అభివృద్ధికి ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల వాగ్దానం సూపర్ సిక్స్ పథకాల అమలు అటకెక్కిందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు అందరినీ అన్ని రంగాల ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మోసగించే సూపర్ బడ్జెట్ బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారన్నారు. బడ్జెట్‌తో ప్రజలకు ఇది మంచి ప్రభుత్వం కాదని, ముంచే ప్రభుత్వంగా నిరూపితమయ్యిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.6 వేల 300 కోట్లు ఎందరు రైతులను ఆదుకుంటాయని విమర్శించారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులు ఆశగా చూస్తుంటే, అర కొర నిధులతో వెక్కిరిస్తున్నారన్నారు. ప్రస్తుతం రైతు సమస్యల పరిష్కారానికి.11 వేల కోట్లు అవసరమన్నారు. కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ కోసం రైతులను నిరీక్షణకు గురి చేయడం అన్యాయమన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే ముష్టి రూ.300 కోట్లు ధరల స్థిరీకరణనిధికి ఇవ్వడం రైతు ద్రోహమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వత్సవాయి సత్యనారాయణ రాజు, ఏపీ సిసి జనరల్ సెక్రెటరీ డాక్టర్ నక్క సత్యనారాయణ, బ్లాక్ వన్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటరత్నం పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం మరియు భౌతిక, రసాయన శాస్త్ర, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ మరియు జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అభ్యసించినప్పుడే పరిపూర్ణ విజ్ఞానవంతులు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ ఐడిఎ కార్యదర్శి, శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల వ్యవస్థాపకులు, ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుండాలని అన్నారు. సైన్స్ విభాగాల అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇంచార్జి మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వివిఎస్ఎన్ కుమార్, ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తేజేశ్వరరావు, గౌరిప్రియ, తదితర సైన్స్ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

యానాంలో ...

విశాలాంధ్ర - యానాం : యానాంలో స్థానిక నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ హైస్కూల్, ఎర్రగార్డెన్స్, యానాం నందు జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో సర్ సివి రామన్‌ను గుర్తు చేసుకుంటూ ఆయన చేసిన ప్రయోగాలను గుర్తుచేసుకుంటూ శుక్రవారం పాఠశాల యందు విద్యార్థులు చేత జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమం అతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ చైర్మన్ నల్లం నాగబాబు, వైస్ చైర్మన్ నల్లం ప్రవీణ మేడం మరియు డైరెక్టర్ ఆకుల నాగలక్ష్మి ముఖ్య అతిథులుగా విచ్చేసినారు. సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో సైన్స్ సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయ, ఉపాధ్యాయులను దుస్సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రవికుమార్, ఇన్చార్జ్ బి సాయిరాం, ఉపాధ్యాయ ఉపాధ్యాయురాలు మరియు విద్యార్థులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఘనంగా టైలర్స్ డే

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి మండల వినాయక దర్జీ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్ డే దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ పితామహుడు ఇలియాస్ హో జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దర్జీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవరపల్లి బస్టాండ్ నుండి జై కిసాన్ యువజన సంఘం వృద్ధాశ్రమంలో గల వృద్ధులకు పండ్లను స్వీట్లు అందజేశారు. దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న వృద్ధులకు రోగులకు పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా దేవరపల్లి మండల వినాయక దర్జీ సహకార సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన కుట్టు మిషన్ పితామహుడు ఇలియాస్ హెూ జయంతిని పురస్కరించుకుని టైలర్ డే దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులలో దర్జీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని అన్నారు. రెడీమేడ్ దుస్తులు రావటం వలన తమ ఉపాధికి కొంత నష్టం చేకూరుతోందని ఆవేదం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల వినాయక దర్జీ సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు చందన వీరభద్రరావు అధ్యక్షుడు ఓరుగంటి వాసు ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, కార్యదర్శి చాపల వెంకటరావు, కోశాధికారి ఆకుల శ్రీను, సంఘ సభ్యులు బర్నికల లింగమూర్తి, అయినపర్తి వెంకట్రావు, మండలం టైలర్స్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జై కిసాన్ జై కిసాన్ యువజన సంఘం వృద్ధాశ్రమం నిర్వాహకులు దెయ్యాల గణేష్ భవాని దంపతులు దర్జీ సంఘం నేతలకు కృతజ్ఞత తెలియజేశారు. ఈ సందర్భంగా దర్జీల సంఘం నేతల సమావేశంలో సీనియర్ దర్జీలను ఘనంగా సత్కరించి జ్ఞాపకాలు అందజేశారు.

నిర్వాసితులకు త్వరలో ఇళ్ల స్థలాలు

విశాలాంధ్ర - గండేపల్లి : రోడ్డు విస్తరణలో భాగంగా గండేపల్లి మండలంలోని రామేశ్వరం పేట ఏడిబి రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు త్వరలో ఇళ్ల స్థలాలు అందజేస్తామని కాకినాడ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మరియు ఆర్డీవో శ్రీమణి అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మార్వో ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాధితులకు సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ బాధితులు ఎవరు కూడా అధైర్యపడవద్దని, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్లో సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రతి విద్యార్థి విద్య-వైజ్ఞానికంగా ఎదగాలి, భావితరాలకు మంచి విజ్ఞానదాయకమైన ఎన్నెన్నో విషయాలు తెలియ జేయాలని విశ్రాంత విద్యాశాఖ అధికారి వై సత్తిరాజు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక భాష్యం స్కూల్లో విద్యార్థులు అనేక రకములైన సైన్స్ పరికరాలను తయారు చేసి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ జె శ్రీనివాస్, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ ఎం లోకేశ్వరరావు, చాంప్స్ ప్రిన్సిపల్ ఎన్ రమాజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యమైన బడ్జెట్

విశాలాంధ్ర - కొత్తపేట : ఎన్డీఏ ప్రభుత్వం శాసన సభలో ప్రవేశపెట్టిన 2025-26 రాష్ట్ర బడ్జెట్ అందరికి ఆమోదయోగ్యం ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం కొనియా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రైతులకు పెద్దపీట వేసి రైతుల పక్ష పాతిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపదను, ఆర్థిక వనరులను సృష్టించగలరన్నారు.

ఘనంగా కుక్కుటేశ్వరుడి శ్రీపుష్ప యాగం

విశాలాంధ్ర - పిఠాపురం : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పిఠాపురం పట్టణంలో శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి, అమ్మవార్ల శ్రీ పుష్పయాగ మహోత్సవం ఘనంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి కట్టాం జగన్మోహన్ శ్రీనివాస్ దంపతులు భక్తులకు తాంబూలాలను అందజేశారు. పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లను హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

సిద్ధార్థ స్కూల్లో జాతీయ సైన్స్ డే

విశాలాంధ్ర - ఆలమూరు : విద్యార్థులు విద్యతోపాటు సైన్సుపై ఆసక్తి కలిగి ఉండాలని సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ కే ముల్లారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఆలమూరు సిద్ధార్థ స్కూల్ నందు జాతీయ సైన్స్‌దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆయన ముందుగా భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు స్వీయ ఆలోచనా ప్రతిభతో విజ్ఞానప రమైన సైన్స్, గణితావిష్కరణలను ప్రదర్శిం చారు. తరగతుల వారీగా పాఠశాల ఆవరణలో సైన్స్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చిన్నారులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థులకు తోడ్పాటును అందించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశూల స్నాన మహోత్సవం

విశాలాంధ్ర - సామర్లకోట : మహా శివరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం పంచా రామ క్షేత్రం సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో త్రిశూల స్నాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ల నీలకంఠం అర్చకులు ఆధ్వర్యంలో రాంబాబు శర్మ, వెంకన్న శర్మ, సత్య నారాయణమూర్తి, సోమేశ్వర శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కోనేరు పుష్కరి ణిలో త్రిశూల స్నాన మహోత్సవాన్ని నిర్వహిం చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరంలో నిర్వహి స్తున్నట్లు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చల్లా బుజ్జి ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారి నిర్వహణలో హుస్సే నపురం గ్రామం పంచా యతీ వద్ద గల ఎలి మెంటరీ పాఠశాల నందు కంటి వైద్య శిబిరం నిర్వ హించడం జరుగుతుం దని పేర్కొన్నారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్య వారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాత రిపోర్ట్, ఫోన్ నెంబరు తీసుకుని రావాలని పేర్కొన్నారు. సామర్లకోట పరిసరప్రాంత ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చల్లా బుజ్జి కోరారు.

పరిశ్రమలపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మండలం వెలుగు కార్యాలయములో సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి (ఎంఎస్ ఎంఈ) ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై వీవోఏస్‌లకు, సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు జిల్లా పరిశ్రమల అధికారి, శివ రామప్రసాద్, ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్, ఫుడ్ ప్రోసెసింగ్ సొసిటీ, డిఆర్‌పి టి ఈశ్వరరావు, వెలుగు ఎపియం, ఆర్ యండి గంగాధర్ మరియు మండలములో ఉన్న ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ముదునూరి వెంకట రాజు, గాదిరాజు ప్రసాద్ రాజు పాల్గొనియున్నారు. పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దబోయే మహిళా సంఘాలు కూడా పాల్గొన్నారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ ఎంఈలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఉద్యోగ అవకాశాలను అందించడం ద్వారా దేశం యొక్క తక్కువ అభివృద్ధి చెందిన మరియు గ్రామీణ ప్రాంతాలను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయని తెలియ జేసారు. ఎంఎస్ ఎంఈ రకాలు, పెట్టుబడి పరిమితి, నమోదు కోసం ప్రమాణాలు, మరియు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వాటిపై తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వీవోఏస్‌లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మినర్వాలో ఘనంగా సైన్స్ డే

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నేషనల్ సైన్స్ డే సందర్భంగా ప్రత్తిపాడు మినర్వా విద్యానికేతన్‌లో నిర్వహించిన సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి మినర్వా విద్యాసంస్థల చైర్మన్ ముత్యాల మురళీ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌బి చౌదరి, మినర్వా ఫౌండర్ డివిఎస్ రాజు రమేష్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్య సంస్థల చైర్మన్ మురళీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సివి రామన్ ఎఫెక్టును కనిపెట్టిన చంద్రశేఖర వెంకట రామన్ 28 ఫిబ్రవరి 1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్నాడు. ఆయన ఈ పరిశోధన ఫలితాన్ని ధృవపరిచిన ఈ రోజును (ఫిబ్రవరి 28) నేషనల్ సైన్స్ డేగా జరుపుకుంటారని తెలియజేశారు. పిల్లలు తయారుచేసిన వాటిలో జెసిబి పనితీరు, కాలుష్య నివారణకు చర్యలు, చంద్రయాన్, బాటిల్ రాకెట్, అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు రాణి, ధర్మ తేజ, మట్టపర్తి లక్ష్మణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో ప్రేమగా మెలగాలి : డా. చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు, ఉప గవర్నర్ అలై పెంకే గోవిందరాజు అధ్యక్షతన క్లబ్ సభ్యులు అలై నీలపాల శ్రీనివాస్ మిత్రులు యంపరాల చంద్రమోహన్ సతీమణి యంపరాల సూర్యకుమారి 3వ వర్ధంతి సందర్భంగా తూరంగి సూర్య నగర్ జనావళి వృద్ధాశ్రమం నందు వృద్ధులకు భోజనం, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ 106 గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు, విశిష్ట అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డా చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రేమభావంతో మెలగాలని వయసు పైబడిన వారికి సహజంగానే మతిమరుపు, కోపం లాంటివి వస్తుంటాయని వాటిని పిల్లలు అర్థం చేసుకుని వారిని ప్రేమగా చూసుకోవాలన్నారు. గవర్నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతి హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినం దనీయమన్నారు. క్లబ్ కార్యదర్శి అలాగే మద్దా వికాష్, క్లబ్ కోశాధికారి అలై కొత్త శ్రీరాములు, డిసిఎస్ అలై కిరణ్ కుమార్, ఆర్‌సి అలై దుర్గా సుభద్ర, డిసి అలై వనుం ఉపేంద్రనాథ్, మేము సైతం మీకోసం అధ్యక్షులు అలై సిహెచ్ గణేష్, అలై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : శాస్త్ర రంగంలో చంద్రశేఖర వెంకటరామన్ చేసిన పరిశోధనలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో పరిశోధకులుగా తయారు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ దేవరపల్లి చెన్నారావు ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవ ముగింపు వేడుకలను శు క్రవారం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు వ్యాసరచన, క్విజ్, సైన్స్ ప్రాజెక్ట్స్ పోటీలను నిర్వహించారు. నిర్వాహకులుగా అధ్యాపకులు గోపాలకృష్ణ, వారణాసి మల్లికార్జున శర్మ వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవం విద్యార్థినీ విద్యార్థుల సైన్స్ పట్ల ఆసక్తిని నింపేందుకు సైన్స్ ఫేర్ నిర్వహించడం జరిగిందన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పివివి సత్యనారాయణ, సెమినార్ కన్వీనర్ సత్యలత, దేవీప్రసన్న, పద్మశేఖర్, వెంకట్రావు, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

బడ్జెట్ రూపకల్పన సంతోషదాయకం

విశాలాంధ్ర - గండేపల్లి : ఏపీ అసెంబ్లీలో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించేలా ఉందని జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మల పల్లి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన జగ్గంపేటలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.48 వేలకోట్లు కేటాయించారన్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా తల్లికి వందనం పథకానికి రూ.9407 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం 6300 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.47,456కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18847 కోట్లు రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం 6705 కోట్లు కేటాయించడం శుభ పరిణామం అన్నారు. విద్య, మున్సిపాలిటీలు, తెలుగు భాషాభివృద్ధి వంటి అంశాలపై ఈ బడ్జెట్లో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని రమేష్ పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సాయం

విశాలాంధ్ర - ఆలమూరు : నూకాంబిక అమ్మవారి దేవస్థానానికి చెందిన ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు చేస్తున్న సహాయం మరువలేనిదని ఆలయ కార్యనిర్వాహణ అధికారి వీర్రాజు చౌదరి అన్నారు. మండలంలోని చింతలూరులో వేంచేసి ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు వంకా అన్నవరం, వైట్ల కనకదుర్గారావు, తదితర పార్టనర్స్ కలసి రూ.2 లక్షలు శుక్రవారం ఆయనకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి తూర్పు, పడమర దిక్కుల్లో రెండు వైపులా ప్రత్యేకంగా దాతల సహకారంతో గోపురాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వైట్ల శేషుబాబు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - కరప : కరప మండలం కొంగుదు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రా లను మండల పంచాయతీ విస్తరణ అధికారి సాలాది వెంకట శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం ద్వారా వచ్చే చెత్తను, తడి పొడిగా వేరు చేసి చెత నుంచి సంపద కేంద్రాలకు తరలించి కంపోస్టు ఎరువులు తయా రీకి ఉపయోగించాన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయా లని తెలిపారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శు భ్రత, మంచినీటి వనరులను శుభ్రంగా ఉంచుట వంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు.

అభివృద్ధికి పెద్దపీట : టీడీపీ నేతలు

విశాలాంధ్ర - రాజానగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 3.22 లక్షల కోట్లతో ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో తెలుగు తమ్ముళ్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు విశాలాంధ్రతో చరావణిలో శుక్రవారం మాట్లాడారు. ఏపీ ఏపీ రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్ సిక్స్ సహా మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల అమలుకు 2025-26 బడ్జెట్లో పెద్దపీట వేయడం ఆనందంగా ఉందని రూడా ఛైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జీ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం పథకం అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారన్నారు. ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని, ముఖ్యంగా విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అటు అభివృద్ధి,ఇటు సంక్షేమం రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టడం హర్షణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చాంటిబాబు అన్నారు. తల్లికి వందనం అనే సూపర్ సిక్స్ పథకంతో ఎందరో పెద విద్యార్థులు జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు అన్నారు. బడ్జెట్లో ,బీసీ వర్గాల సంక్షేమానికినిధులు కేటాయించడం అభినందనీయ మని తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వంక మల్లికార్జున స్వామి (మల్లిబాబు) తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుపై బడ్జెట్‌లో ప్రస్తావించడం ఆనందంగా ఉందనీ మాజీ ఎంపీపీ బచ్చు ప్రసాద్ అన్నారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రు: 43,402 కోట్లు రూపాయలను ప్రస్తుత బడ్జెట్ లో కేటాయించడం అభినందనీయమనీ యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు (నాగు) ఆనందం వ్యక్తం చేశారు. బడ్జెట్ బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీ లతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉందని టిడిపి అధికార ప్రతినిధి నూనె వెంకన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, చేనేతలకూ ఉచిత విద్యుత్‌పై ఎఐఎస్సిఆర్పిఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులుగా ఖండవల్లి లక్ష్మి అన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

విశాలాంధ్ర-కాకినాడ: రహదారి భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో కాకినాడ నగరంలో హోండా మోటార్ సైకిల్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రభుత్వ ఐటీఐ కాలేజ్, శ్రీ రాజరాజేశ్వరి ఐటీఐ కాలేజ్, కేంద్రీయ విద్యాలయంలోని 1900 మందికి పైగా విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బోధన సిబ్బంది సహా బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తనపై విలువైన సమాచారాన్ని పొందారు. రహదారిపై ఎలా సురక్షితంగా ఉండాలో వారికి అవగాహన కల్పించడం జరిగింది. భవిష్యత్ తరాలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్ఎంఎస్ఐ ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. యువతలో ప్రారంభ దశలోనే రహదారి భద్రతా జ్ఞానాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని గుర్తించిన తాము, ఈ కార్యక్రమాన్ని కేవలం అవగాహన కల్పించేందుకు మాత్రమే కాకుండా దీర్ఘకాలిక మార్పును ప్రేరేపించేందుకు రూపొందించామని చెప్పారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్రదేవరపల్లి: దేవరపల్లిలో గల శ్రీ చైతన్య స్కూల్లో శుక్రవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్‌పై అవగాహన కలిగి శాస్త్రవేత్తలకు దీటుగా పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ సమాజానికి కొత్త విషయాలు తెలియజేయటానికి సైన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఏజీఎం పార్థసారధి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన కలిగి కొత్త విషయాలు తెలుసుకోవడానికి తమ యుక్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్రాయింగ్ క్విజ్ స్పీచ్ డాన్స్ పోటీ కార్యక్రమం లో పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ కిషోర్ వైస్ ప్రిన్సిపాల్ అనురాధ ఏజీఎం పార్థసారథి బహుమతులు మేమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఘనంగా టైలర్స్ డే

విశాలాంధ్ర - కాట్రేనికోన : కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ జయంతి సందర్భంగా శుక్రవారం కాట్రేనికోన మావుళ్ళమ్మ గుడి వద్ద శ్రీ నవోదయ అభ్యుదయ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో దర్జీల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. విలియమ్స్ చిత్రపటానికి బజ్జీలు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిల్లలకు మిఠాయిలు, పండ్లు పంచారు. ఈ సందర్భంగా మండల దర్జీలసంఘం అధ్యక్షులు విత్తనాల వెంకట వరప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన దర్జీలకు రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాషా, డి శ్రీను, వెంకటేశ్వరరావు, వి సత్తిబాబు, బి శ్రీను, గణేష్, సుబ్బారావు, అక్కల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్నియాలు సేకరణలో లయన్స్ జిల్లాలో మొదటి స్థానం

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్ళరేవు లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ ధూళిపూడి వెంకటరమణ (బాబి) నేత్రదానంపై అవగాహన కల్పించి మరణానంతరం వాళ్ళ కుటుంబ సభ్యులచే నేత్రదానం (కార్నియాలు) చేయించడంలో 316-లయన్స్ జిల్లా పరిధిలో మొదటి స్థానంలో నిలిచారని ఈ విధంగా సేవ చేయడం ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక మంది కార్నియల్ అంధత్వంతో మసకబారిన జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఈ విధంగా ప్రతీ లయన్స్ క్లబ్ సభ్యులు వారి పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నేత్రదానం పై అవగాహన కల్పించేందుకు కృషి చెయ్యాలన్నారు. రీజనల్ ఛైర్మన్ బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ధూళిపూడి బాబి చేస్తున్న కార్నియా సేకరణ వలన అనేక మంది అంధత్వంతో బాధపడుతున్న వారి కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని, బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు వారు సిబ్బంది సేవలు కూడా అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ధూళిపూడికి చిరు జ్ఞాపిక అందజేశారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్ద పేట

విశాలాంధ్ర - కొత్తపేట : బడ్జెట్ సమావేశంలో ముస్లిం మైనారిటీ సంక్షేమానికి అత్యధికంగా బడ్జెట్‌ని కేటాయించ చడం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ మీరాన్ షరీఫ్, హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీ సంక్షేమానికి రూ.5,434 కోట్ల భారీ నిధులను కేటాయించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి షరీఫ్ శుక్రవారం పత్రిక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు నాయ కత్వంలో, దేశంలోనే మొదటిసారిగా అత్యధిక నిధులను మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రాష్ట్రంగా మన ఆంధ్రప్రదేశ్ నిలిచింది అని షరీఫ్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే ఇంత భారీ బడ్జెట్‌ని కేటాయించేందుకు కృషి చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి NMD ఫరూక్‌కి, ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్‌కి ధన్యవాదాలు తెలిపారు. వారిద్దరి నిబద్ధత కృషి ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించింది అని షరీఫ్ కొనియాడారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచర(కపిలేశ్వరపురం) తల్లిదండ్రుల ఆకాం క్షలను నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయ్యాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం భాషా హితవు పలికారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జరుపుకునే జాతీయ సైన్సు దినోత్సవాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మాచర పూర్వవిద్యార్థుల సంక్షేమ సంఘం (MWAA) ప్రొఫెసర్ గొడవర్తి భగవన్నారాయణ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సివిరామన్ చిత్రపటానికి మాచర ఆలుమిని సభ్యులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. సమావేశంలో డీఈవో సలీం భాషా మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో రామన్ చేసిన అపారమైన సేవలకుకు ఫిబ్రవరి 28ని జాతీయ సైన్సు దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. ప్రతి విద్యార్థి శాస్త్ర, సాంకేతిక విషయాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని హితవుపలికారు. సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి ఎంపీడీవో రత్నకుమారి, జిల్లా సైన్సు అధికారి జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ రాంబాబు, డాక్టర్ రాకేష్, ఎస్ఎంసి అధ్యక్షుడు కె భీమేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు సత్యమంగాదేవి, డాక్టర్ కొరిపెల్ల రామకృష్ణారావు, గుడాల రామకృష్ణారావు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజానపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయులు ఎం సాయి మోహన్ ఆధ్వర్యంలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1928 సంవత్సరంలో సర్ సివి రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా 1987 నుంచి జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకోవడం జరుగు తుందన్నారు. విద్యార్థులు గ్రేడులు కోసం కాకుండా, సృజనా త్మకంగా ఆలోచించి, నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ముం దుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్టాఫ్ సెక్రెటరీ ఐ ప్రసాద రావు, వివి రమణమూర్తి, వేణుగోపాలరావు, ప్రభారాణి, భవాని, శరత్, మాణిక్యాంబ, అర్జున్ రావు ,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్ సీవీ రామన్ జయంతి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూలులో సర్ సీవీ జయంతి సందర్భంగా నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సివిరామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇంఛార్జి హెచ్ఎం వి రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్సు డయాగ్రమ్స్, రంగ వల్లులు, సైన్స్ ఎగ్జిబిట్స్‌లో పోటీలు నిర్వహించారు. ఇంఛార్జి హెచ్ఎం రాజు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని, సివి రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ గురించి, దాని ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. సీనియర్ సైన్సు ఉపాధ్యాయురాలు ఏ ఎల్వి కుమారి మాట్లాడుతూ విద్యార్థి సైంటిఫిక్ టెంపర్మెంట్‌ని పెంచుకో వాలనీ, సైన్సెని నిజజీవితంలో అన్వయించి మూఢనమ్మకాలను విడనాడాలన్నారు. సీనియర్ సైన్స్ టీచర్ కె శ్రీనివాసు మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చేయుట ద్వారా మానవాళి అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

విశాలాంధ్ర - కాకినాడ : అటు అభివృద్ధి,ఇటు సంక్షేమం రెంటికి సమాన ప్రాధాన్యత కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించి ప్రగతిశీల బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. కాకినాడ కేంద్రంగా రాష్ట్రస్థాయి హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ విద్యాసంస్థని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోవటం దానికి నిధులు కేటాయించడం జిల్లా వాసుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. వ్యవసాయానికి ఎన్నడు లేని విధంగా అత్యధిక నిధులు కేటా యించటమేకాక పిఠాపురం నియోజకవర్గంలోని పట్టు పరిశ్రమ కు నిధులు కేటాయించడం ఆనందదాయ కమన్నారు. దశాబ్దా లుగా నత్తనడకన సాగుతున్న నీటిపారుదల ప్రాజె క్టులను శరవేగంగా పూర్తి చేయడానికి ఎన్నడూ లేని విధంగా రూ.18 వేల కోట్లు కేటాయించడం, మౌలిక వసతుల కల్పనకు రూ.40 వేల కోట్లు కేటాయించడం ఈ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది అని చెప్పటానికి నిదర్శనమన్నారు. ఈ ప్రభు త్వం సంక్షేమానికి తన చిత్తశుద్ధిని చాటుకుందని రవి కిరణ్ కొనియాడారు.

సిబ్బంది మర్యాదగా వ్యవహరించండి : కలెక్టర్

విశాలాంధ్ర-అమలాపురం : పింఛనుదారులతో పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ అమరావతి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పింఛన్ల పంపిణీ, వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరా, ఎంఎస్ఎం ఈ సర్వే, ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు సంబంధించి ప్రజల ఫీడ్‌బ్యాక్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశ అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తోందని..పింఛన్లను పంపిణీ చేసే సమయంలో పింఛనుదారులతో పింఛను అందించే సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. పింఛన్లను ఒక ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలన్నారు. ప్రతినెల మొదటి రోజున ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పింఛన్ పంపిణీ చేయాలన్నారు. మిగిలిన వారికి తరువాత రోజున పంపిణీ చేయాలన్నారు. పనులకు వెళ్లే వారికి మొదటిగా పింఛన్ ఇవ్వాలన్నారు. పింఛన్ పంపిణీ విషయంలో నూతనంగా అభివృద్ధి చేసిన అప్లికేషను ఉపయోగించి పింఛనుదారుడికి ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేయాలన్నారు. పింఛన్ ఇంటివద్ద అందివ్వలేని పక్షంలో దానికి గల కారణాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. రానున్న వేసవి సీజన్లో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఆర్డబ్ల్యుఎస్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపడం, బోర్ బావులను ఎక్కువ లోతు చేయడం, బోరు బావులలో పూడిక తీయడం, అవసరమైన చోట ప్రైవేటు నీటి సోర్సులను గుర్తించడం వంటివి చేయాలన్నారు. ప్రైవేటు వీలుకాని పక్షంలో వాటర్ ట్యాంకుల ద్వారా సురక్షితమైన నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించడం జరుగుతుందని..అధికారులు సంక్షేమ అభివృద్ధి పథకాలను ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజలకు అందించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, పిడి డీఆర్డీ డాక్టర్ శివశంకర ప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి ప్రసాద్, పిడి డ్వామా మధుసూదన్ పాల్గొన్నారు.

సీపీఐ శతవసంతాల కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - రాజోలు : మలికిపురం మండలం దిండి గ్రామంలో శుక్రవారం సీపీఐ శతవసంతాల కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ పాల్గొని సీపీఐ శతవసంతాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అంబాజీపేటలో ఉదయం 10 గంటలకు జరిగే సీపీఐ శతవసంతాల బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేవ సురేష్ బాబు, దేవ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - ఆలమూరు : మార్చి 8న స్థానిక కోర్ట్ ఆవరణమునందు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జ్ జడ్జి వి నాగేశ్వరరావు నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సివిల్ కోర్టులో పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోనేటట్లు చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వాది, ప్రతివాదులు కాలయాపన చేయకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించు కోవాలన్నారు. అలాగే రాజీ పడదగిన క్రిమినల్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించు కోవాలన్నారు.

నాటు సారాపై అవగాహన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ఈఎస్ కృష్ణకుమారి ఆదేశాల ప్రకారం ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మండలంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. అలాగే పాదురుపాక గ్రామంలో నాటు సారాయి తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి అనంతరం పెద్దిపాలెం గ్రామంలో నాటు సారాయి గంజాయి నిర్మూలనకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిపి నిర్వహించి నాటు సారాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి శివప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ పి వంశీరామ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా : సీఐ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఈ ఏడాది మార్చి 1వ తేదీ నుండి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించనున్నట్లు ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు స్పష్టం చేశారు. ఈ నూతన చట్టం ప్రకారం హెల్మెట్ ధరించకపోవడం, లైసెన్స్ లేకపోవడం, ప్రమాదకరంగా వాహనం నడపడం, మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, సీట్ బెల్ట్ ధరించక పోవడం వంటివి నిబంధనల ఉల్లంఘనల క్రిందకు వచ్చి భారీ జరిమానాలు విధించే విధంగా చట్టంలో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే 5 వేలు, హెల్మెట్ లేకుండా ఉంటే 1000, ట్రిపుల్ రైడింగ్‌కు 1000, ప్రమాదకరమైన డ్రైవింగ్‌కు మొదటి నేరానికి 1500, రెండో నేరానికి 10,000 జరిమానా విధించనున్నట్లు చెప్పారు. అందువల్ల ప్రజలు ఈ నూతన చట్టాలు పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సిఐ సూచించారు. అదే విధంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు కలిగి ఉండటం ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని చెప్పారు. ఈ నూతన నిబంధనలు ప్రజల భద్రత కోసం తీసుకున్న చర్యలుగా భావించాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు అన్నారు.

ముగిసిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ హాకీ టోర్నీ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలో గత 14 రోజుల నుంచి సాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్-2025 పోటీలు శుక్రవారంతో ముగిసాయి. కాకినాడలోని జేఎన్టీయూకే గ్రౌండ్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఈ హాకీ పోటీల్లో మహిళా విభాగంలో ఒడిశా, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించగా పురుషుల విభాగంలో ఢిల్లీ, ఆంధ్ర అండ్ తెలంగాణ, హర్యానా జట్లు వరుసగా మూడు స్థానాల్లో విజయం సాధించాయి. ఈ సందర్భంగా ముగింపు వేడుకలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు మెమెంటోలను, ట్రోఫీలను అందజేశారు. గెలుపొందిన విజేతలకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన, ఈ కార్యక్రమానికి సహకరించిన ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

పోలీసు శాఖ స్థల పరిశీలన

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేటలో ఉన్న పోలీస్ శాఖ స్థలాన్ని ఐఒసిఎల్ కంపెనీ వారికి కేటాయించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్, పెద్దాపురం ఆర్డీవో రమణి శుక్రవారం పరిశీలించారు. గోకవరం రోడ్డులో టెలిఫోన్ ఎక్స్చేంజ్ ప్రక్కన ఉన్న టాక్సీ స్టాండ్ స్థలం పోలీసు శాఖది కావడంతో ఆ స్థలాన్ని పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని పోలీసు శాఖ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. దాంతో వారు వచ్చి స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట తహశీల్దార్ జెవిఆర్ రమేష్, ఎంపిడిఓ ఎవిఎస్ చంద్రశేఖర్, ఎస్ఐ రఘునాథరావు, రెవిన్యూ అధికారులు వున్నారు.

ఎన్నికల సిబ్బంది సౌకర్యాలపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర ఏలూరు: ఎన్నికల విధులంటే కత్తిమీద సాము లాంటిది. ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా బాధ్యతతో నిర్వర్తించవలసి ఉంటుంది. అటువంటి బాధ్యతలను సిబ్బంది నుండి ఆశించేటప్పుడు వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. ఈ విషయంలో ఏలూరు జిల్లా యంత్రాంగం తమ బాధ్యతలను నూటికి నూరుపాళ్లు నెరవేర్చిందనే చెప్పాలి. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తి అయింది. పోలింగ్ అనంతరం ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరిజిల్లాల పరిధిలోని 6 జిల్లాలైన ఏలూరు,పశ్చిమ గోదావరి,తూర్పు గోదావరి,డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా, కాకినాడ జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను పోలింగ్ సిబ్బంది ఏలూరు సర్. సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు తీసుకువచ్చారు. గత రెండు రోజుల నుండి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఎన్నికల విధులు నిర్వహించి, చివరి అంకమైన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు మొదటి బ్యాచ్ తీసుకువచ్చేసరికి గురువారం రాత్రి సమయం అయింది. ఒకవైపు బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపులో తలమునకలై ఉన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మరోవైపు బ్యాలెట్ బాక్సులు తీసుకు వచ్చిన సిబ్బంది, రిసిప్షన్ సెంటర్లో సిబ్బందికి రుచికరమైన ఆహారం అందించే విషయాన్నీ ప్రత్యేకంగా తీసుకున్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన ప్రదేశంలో,మంచి రుచికరంగా తయారయ్యేలా దగ్గరుండి పర్యవేక్షించారు. వండిన ఆహారాన్ని రుచి చూసి రుచికరంగా ఉందని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంతో శ్రమకోర్చి ఎన్నికల విధులలో పాల్గొన్న తమ శ్రమను గుర్తించి, తమపట్ల ప్రత్యేక శ్రద్ధతో మంచి రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి చూపిన శ్రద్ధను పోలింగ్ సిబ్బంది కొనియాడారు. తమపట్ల ఇంత శ్రద్ధ చూపిన కలెక్టర్ వెట్రిసెల్వి కి ఉద్యోగులు తమ కృతజ్ఞతలు తెలియజేసారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి,డీఆర్ ఓ వి. విశ్వేశ్వరరావు, ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, రమణ,ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, ఏలూరు తహసిల్దార్ శేషగిరిరావు, ప్రభృతులు పాల్గొన్నారు.